# 'ఎన్‌కౌంటర్' మాటున ప్రజాప్రతినిధుల హత్య

మే నెల 29న కాచనపల్లి గ్రామం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్ పోలీసులు చెప్పినట్టు ఒక్క సంఘటనగా కాక, రెండు సంఘటనలుగా జరిగింది. 29వ తేదీ ఉదయం 6.00 లేక 6.30 గంటలకు కాచెనపల్లికి రెండు కి.మీ.ల దూరాన వున్న వాగు దగ్గర ఒకసారి కాల్పులు జరిగాయి, కోటన్న అనే దళ సభ్యుడు చనిపోయాడు. అతనితో బాటు మరికొందరు సాయుధ దళ సభ్యులు ఉన్నారు. వారు తప్పించకొని పారిపోయారు. వాళ్ళుగానీ, కోటన్నగానీ పోలీసుల మీద కాల్పులు జరిపారని నమ్మడానికి ఎటువంటి ఆధారాలు లేవు. పైగా కోటన్న పారిపోతూ వుండగా పోలీసులు పక్కనుండీ, వెనకనుండీ తరిమి కాల్చారని నమ్మడానికి ఆధారాలున్నాయి. అతనికి దవడ మీద, చేతిమీద, కాలిమీద తగిలిన బుల్లెట్ గాయాల వల్ల విపరీతంగా రక్తస్రావం జరిగి అతను కొంతదూరం పరుగెత్తి క్రిందపడి చనిపోయాడు.

ఇక రెండవ 'ఎన్‌కౌంటర్' ఆరోజు ఉదయం 10.30 లేక 11.00 గంటలకు జరిగింది. ఇది పూర్తిగా నగ్నమయిన హత్య. మృతులు నంబూరు సీతారామారావు, సుశేనా కుమారి, చింతాలక్ష్మి, పరశురాములును పోలీసులు కాచెనపల్లి నుండి ఇల్లెందుకు వచ్చే రోడ్డుమీద, కాచెనపల్లికి అర్థ కిలోమీటర్ ధూరంలో ఉదయం 6.30 లేక 7.00 గంటల ప్రాంతంలో అరెస్టు చేసి, బాగా కొట్టి, కోటన్న శవం దగ్గరకి తీసుకుపోయి అక్కడ కాల్చేసారు.

ఈ నలుగురూ సాయుధ దళం సభ్యులు కారు. ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు బాధ్యులు. అయితే వీళ్ళు సాయుధ దళాలను కలవడానికి కాచెనపల్లికి వెళ్ళారనీ, సాయుధ దళంతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయారనీ, పోలీసులు అంటున్నారు. ఇది ఎంత మాత్రం నిజం కాదు. వాళ్ళు నలుగురూ 28 రాత్రే కాచెనపల్లి చేరుకున్నారు. ఆ రాత్రంతా ఆ గ్రామంలోనే వున్నారు. మరుసటి రోజు (29వ తేదీన), రాబోయే ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్ణయించుకోవడానికి సి.పి.ఐ. (ఎం.ఎల్) అభ్యర్థి గడ్డం వెంకటరామయ్య ప్రచార నిర్వాహకుల సమావేశం ఉండింది. ఈ సమావేశంలో పాల్గొనబోయే వారెవ్వరూ రహస్య కార్యకర్తలు కారు. అందరూ ప్రజా సంఘాల నాయకులు, సర్పంచ్‌లు, మండలాధ్యక్షుడు తదితర ప్రజా ప్రతినిధులు.

28వ తేదీ రాత్రి 2 గంటల సమయంలో ఇల్లందు డి.ఎస్.పి. నాయకత్వంలో పోలీసులు కాచెనపల్లి మీద దాడి చేసారు. ముగ్గురి ఇళ్ళమీద దాడి చేసి సోదా చేశారు. గ్రామంలో ఏదో మీటింగ్ జరిగిందంటూ దాని వివరాలు చెప్పమని అడిగారు. గ్రామప్రజలను బెదిరించారు. ఈ సంగతి తెలిసిన పై నలుగురు తెల్లవారు జామున తప్పించుకుని బయట పడ్డారు. రెండు కిలోమీటర్ల దూరంలో వాగువద్ద మొదటి 'ఎన్‌కౌంటర్' జరిగింది.

తరువాత ఇంకా ఎక్కువ సంఖ్యలో సాయుధ పోలీసులు కాచెనపల్లికి వచ్చారు. ఊరి బయట వున్న నలుగురు కార్యకర్తలను అరెస్టు చేసారు. వాళ్ళ చేతులు వెనక్కి కట్టి నడిపించి తీసుకుపోతూ ఉండగా చూసిన సాక్షులున్నారు. వ్యాన్‌లో తీసుకుపోతూ వుండగా చూసిన సాక్షులున్నారు. వాళ్ళను కస్టడీలోకి తీసుకున్న తర్వాత వెంటనే ఎక్కడికి తీసుకుపోయిందీ తెలీదు. చివరికి ఉదయం 10.30 తర్వాత మళ్ళీ మొదటి 'ఎన్‌కౌంటర్' జరిగిన స్థలం నుండే కాల్పులు వినిపించాయి. ఆలోపల వాళ్ళను బాగా చిత్రహింసలకు గురి చేసారు. ఆ సమయంలో వాళ్ళు చనిపోగా వాళ్ళను తీసుకొచ్చి ఇక్కడ కాల్చినట్టు నాటకం ఆడారా, లేక వేరే ఎక్కడో కాల్చేసి ఇక్కడికి తీసుకొచ్చి శవాలను పడేసారా, లేక ఇక్కడికి తీసుకొచ్చి కాల్చారా తేల్చటం కష్టం. వాళ్ళ శరీరాలలో ఊపిరితిత్తులు, కాలేయం, కడుపు మొదలయిన కీలక అంగాలలో బుల్లెట్లు తగిలాయి. ఒక స్త్రీకి పేగులు మొత్తం బయటికి వచ్చాయి. అయితే ఆశ్చర్యంగా వాళ్ళ శవాల దగ్గర రక్తం లేదు. అంతేకాక, వాళ్ళ ముఖాలు నల్లగా కమిలిపోయి ఉన్నాయి. సీతారామారావు ముఖం ఎంత వికృతంగా తయారయిందంటే, 'ఎన్‌కౌంటర్' జరిగిన మూడు నాలుగు గంటలలో పంచనామా నిర్వహించడానికి వచ్చిన గుండాల ఎం.ఆర్.ఓ.కు సీతారామారావు బాగా పరిచితుడయినా ఆయన అతన్ని గుర్తించలేక పోయాడు.

ఈ హత్యాకాండకు జిల్లా పోలీస్ అధికార్లలో ఎవరు ప్రత్యక్షంగా బాధ్యులనేది సందిగ్ధంగానే వుంది. ఇల్లందు డి.ఎస్.పి. నాయకత్వం వహించాడని ఎన్.పి. అంటుండగా తాను కాచెనపల్లిలోనే ఉండిపోయాననీ 'ఎన్‌కౌంటర్'లో పాల్గొనలేదనీ డి.ఎస్.పి. అంటున్నాడు. జిల్లా ఎన్.పి. 10.30కే కాచెనపల్లి వచ్చారనీ ఆయన వచ్చిన తరువాతే సీతారామారావు తదితరులను చంపారనీ స్థానిక ప్రజలు అంటున్నారు. అయితే తాను 'ఎన్‌కౌంటర్' సమాచారం తెలిసిన తరువాతే అక్కడికి వెళ్లానని ఎన్.పి. అంటున్నాడు.

కాల్చి చంపకముందు చిత్రహింసలకు గురి చేసిన విషయం పోస్ట్‌మార్టం పరీక్షలలో తేలగలదు. అయితే జిల్లా పోలీసు యంత్రాంగం పోస్ట్ మార్టం సకాలంలో జరగకుండా అడ్డుపడ్డాయి. 29 ఉదయం 'ఎన్‌కౌంటరు' జరిగితే 48 గంటల తరువాత పోస్ట్‌మార్టం జరిగింది. దానివల్ల ఒళ్ళంతా కుళ్ళిపోయి దెబ్బల గుర్తులు మిగలకుండా పోయాయి. ఇది క్షమించరాని నేరం. చట్టరీత్యా కూడా హత్య కేసులో పోస్ట్‌మార్టం నిష్కారణంగా అలస్యమయితే అది సాక్ష్యాలను మాయం చేసే నేరం

(సెక్షన్ 201) కిందికి వస్తుంది.

30 వ తేదీన ఈ హత్యాకాండకు నిరసనగా శాంతియుతంగా ఇల్లందు మండల కేంద్రంలో సభ నిర్వహించిన కార్యకర్తలపైన పోలీసులు హెచ్చరిక లేకుండా, కారణం చూపకుండా, తీవ్రంగా లాఠీచార్జీ చేసారు. చాలామందికి తీవ్రంగా గాయాలయ్యాయి. ఇల్లందు ఎం.ఎల్.ఏ. తో పాటు ప్రస్తుత పార్లమెంటు ఎన్నికలలో వరంగల్, ఖమ్మం నియోజక వర్గాలలో అభ్యర్థులుగా పోటీచేస్తున్న బోగా శ్రీరాములు, గద్దం వెంకట్రామయ్యలతో సహా 9 మందిని అరెస్టు చేశారు.

ఈ వాస్తవాల ఆధారంగా నిజనిర్ధారణ కమిటీ ఈ క్రింది డిమాండ్లు పెడుతూ వుంది.

(1) కాచెనపల్లి 'ఎన్‌కౌంటర్' పైన న్యాయవిచారణ జరపాలి. పోస్టుమార్టం నిష్కారణంగా అలస్యం చేసినందుకు జిల్లా ఎస్.పి., ఇల్లందు డి.ఎస్.పి.ల మీద సెక్షన్ 201 కింద కేసు పెట్టి అరెస్టు చేయాలి. 'ఎన్‌కౌంటర్'కు బాధ్యులయిన పోలీస్ అధికార్లను సస్పెండ్ చేసి, విచారణ అనంతరం హత్యకేసు పెట్టాలి.

(2) మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి 1 లక్ష రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలి.

(3) ఈ 'ఎన్‌కౌంటర్' ఎన్నికల నేపథ్యంలో జరిగింది. ప్రస్తుతం ఇల్లందు ప్రాంత ప్రజలు భయభ్రాంతులయి వున్నారు. ప్రజల ఇష్టమయిన అభ్యర్థికి స్వేచ్ఛగా నిర్భయంగా వోటు వేసుకునే హక్కును, ప్రచారం చేసుకునే హక్కును జిల్లా అధికార యంత్రాంగం రక్షించాలని డిమాండ్ చేస్తున్నాం.

(4) ఏ నియంత్రణ లేకుండా విచ్చలవిడిగా భీభత్సం సృష్టిస్తూ వున్న స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ టాస్క్‌ఫోర్సు పోలీసులను వెనక్కి తీసుకోవాలి. అన్ని 'ఎన్‌కౌంటర్ల' పైన న్యాయ విచారణ జరిపించాలి.

మేనెల 20న తేదీన కాచెనపల్లి గ్రామం దగ్గర జరిగిన ఈ 'ఎన్‌కౌంటర్' గురించి వాస్తవాలు సేకరించడానికి ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం నిజ నిర్ధారణ కమిటీ మే 1న కాచెనపల్లి, ఇల్లందు ప్రాంతాలు పర్యటించింది. స్థానిక ప్రజలతో, సి.పి.ఐ(ఎం.ఎల్) (ప్రజాపంథా) బాధ్యులతో, ఇల్లందు డి.ఎస్.పి.తో, గుండాల ఎమ్.ఆర్.ఓ.తో, పోస్ట్‌మార్టం నిర్వహించిన నలుగురు డాక్టర్లలో ఒకరయిన ఇల్లందు ప్రభుత్వ డాక్టరు పసుమతితో, ఖమ్మం జిల్లా ఎస్.పి.తో, కలెక్టర్‌తో మాట్లాడిన తరువాత నిజనిర్ధారణ కమిటీ పై నిర్ధారణకు వచ్చింది.

నిజనిర్ధారణ కమిటీ సభ్యులు : కె. బలయ్య (రాష్ట్ర సహాయ కార్యదర్శి, APCLC); వి. వేణు(APCLC ఖమ్మం జిల్లా కార్యదర్శి); ఎన్. మల్లిఖార్జున రావు (APCLC ఖమ్మం జిల్లా అధ్యక్షుడు); వి. కృష్ణమూర్తి (APCLC రాష్ట్రకార్యవర్గ సభ్యుడు); డా. జి. నర్సాగౌడ్ (ఉస్మానియా యూనివర్సిటి); నిమ్ము (ప్రజారస); సి.హెచ్. శంకర్ (APCLC జిల్లా కార్యవర్గ సభ్యుడు.)

**డా॥ కె. బాలగోపాల్**
**ప్రధాన కార్యదర్శి**
**ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం**

## జీవగాథ

(5వ పేజీ తరువాయి)

రులు బదిలీ కాగానే ఈ పనులన్నీ మళ్ళీ మొదటికొస్తాయి.

70 చట్టం రద్దుతో పాటు, భద్రాచలం నియోజకవర్గంలో ఈ భూముల సమస్యకు పోలవరం ప్రాజెక్ట్ పరిష్కారం చూపగలదనే ఆశ ఉంది. నిజానికి పోలవరం ప్రాజెక్ట్ వల్ల భద్రాచలం నియోజకవర్గానికి నష్టం 220 గ్రామాలు మునుగుతాయి. అలా మునిగినా ఫరవాలేదు. అమ్ముకోడానికి ఎలాగూ వీలులేదు. పట్టాలున్నాయి. కాబట్టి పరిహారం అన్నా వస్తుందని గిరిజనేతరులు వారి మీద ఆధారపడిన గిరిజన ప్రజాప్రతినిధులు, పోలవరం ప్రాజెక్ట్ కావాలి అని నినాదాలు ఇస్తూంటారు.

**సెటిల్మెంట్లపై తిరుగుబాటు:**

ప్రభుత్వం ఏ పరిష్కారం చూపక పోతే గిరిజనుడు చేతులు ముడుచుకొని కూచోడు. ప్రజలు తిరగబడడం మొదలుపెట్టాక ఎక్కడ అవకాశముంటే అక్కడ ప్రత్యక్ష చర్యకు దిగుతారు. కోయల వీరవరంలో 50 ఎకరాల మట్టా సోమరాజు తోట, సీతారంలో ముత్యాల వారి పొలం, రమణయ్య పేటలో తాతయ్య పొలం బోడిగూడెం, దొంగల రావిలంక, దండంగి, గంగలంపాలెం, గుబ్బలం పాలెంలో పొలాలు రైతుకూలి సంఘాలు స్వాధీనం చేసుకున్నాయి. గిరిజనులకు అన్యాయం జరిగినట్లు తెలిసినప్పటికీ సెటిల్‌మెంట్ పట్టాలు రద్దు చేసే అధికారం లేక, గిరిజనుల భూములు ఆక్రమించినపుడు ఉన్నతాధికారులు చూసి చూడకుండా పోయేవారు. సీతారంలో పొలాల మీద రిసీవర్‌ను నియమించినప్పటికీ గిరిజనులే పంట కోసుకోగలిగారు అయితే జట్లు, జట్లుగా దాడులకే పూనుకోవడంతో ఉభయ వర్గాల సంఘర్షణలలో కొడేపూడిలో ఒక గిరిజనేతరుడు, సీతారంలో ఒక రైతు కూలి సంఘం నాయకుడు, అతని గిరిజన అనుచరుడు, ఇటీవలే కాంగ్రెస్‌కు చెందిన గిరిజన నాయకుడు మరణించాడు. ఈ మధ్య కాలంలో గిరిజనేతరుల ఆక్రమణలోని బంజర్లను కొంతపంచారు. ప్రజలు తిరగబడుతున్నారు. హత్యలు జరుగుతున్నాయి. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు వస్తున్నారు, పోతున్నారు. అందరూ తగువులు చేస్తున్నారు. కుదరకపోతే దౌర్జన్యానికి దిగుతున్నారు తప్ప చట్టబద్ధమైన పరిష్కారం కోసం ప్రయత్నాలు మాత్రం సాగడం లేదు. చట్టానికి ఏ మాత్రం పదును పెట్టినా తమకు నష్టం జరుగుతుందని గిరిజనేతరులు గగ్గోలు పెడుతున్నారు. చట్టం పనిచేయక పోతే ప్రజలే తప్పని పరిస్థితుల్లో చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటున్నారు.

**— శక్తి**